# 31. సంస్కారి

'కవి సార్వభౌములు శివరావు గారికి-'

ఆ వాక్యం చదవగానే ఒక శీతల ప్రవాహం వెన్నెముకలోంచి త్వరితగతిని శివరావులో ప్రవహించింది. తను కవిత్వం రాయటం మానుకొని రెండేళ్ళయింది. ఒక పూర్తి పంచవర్ష ప్రణాళిక కంతా రాసినా తనను పై విధంగా సంబోధించిన వా రెవ్వరూ లేరు. తను రాసిన కవిత్వం ఎప్పుడూ వివాదగ్రస్థంగానే ఉండేది. అదీ తీవ్రరూపాన లేకుండటంవల్ల సాహిత్యంలో అగ్రస్థానాలను ఎన్నడూ అందుకోలేదు.

కవిత్వం రాయటం సంస్కృతిలో ఒక భాగమనీ, ఫాషన్ అనే ధోరణిలోనే తాను రచనలు సాగించాడు. ముఖ్యంగా శృంగార కవిత్వం - అంటే భావకవిత్వాన్నే ఉపాసించాడు. తన బాబుల్లాగు ఆ కవిత్వాన్ని సాధన చేసి రాసినవాళ్ళు తనకన్న ముందే పుట్టి ఆ పేరంతా స్వంతం చేసుకోవటం వల్ల, తను రాసింది అంతగా రాణించలేదు. ఇలా కాదని సాహిత్య సభల్లో గొంతెత్తి పాడి చూశాడు. కాని ఆశించిన 'ఎఫెక్టు' రాలేదు. తన స్నేహితుల్లో కొంతమంది బాగుందన్నారు. మిగతావారు - అంటే కవిత్వమంటే బాగా తెలిసినవారు ఎలాటి అభిప్రాయమూ చెప్పకుండా నవ్వి ఊరుకున్నారు.

బహుళ ప్రచారం లేనిదే ఏదీ రాణించదనే సత్యాన్ని తెలుసుకొని కేవలం పత్రికల్లో అడపాదడపా ప్రచురించబడట మొక్కటే చాలదని గ్రహించి - అంతవరకూ తాను రాసిన కవిత్వాన్ని ఐదారు సంపుటాలుగా అచ్చొత్తించాడు. భావకవిత్వానికి అనుగుణంగానూ అందచందాలు చిందేట్లుగానూ ఉండే నిమిత్తం ఫెదర్ వెయిట్

కాగితంమీద పేజీకి పదహారు లైనులే వేయించి, చాకలి పద్దులు రాసుకునేందుక్కూడా వీలుగా ఉండేట్లు సైడ్ మార్జిన్లు వొదిలి ప్రచురించాడు. ఐతే ఎంతకూ కాంప్లిమెంట్ కాపీలుగా అవి చెల్లినవే కాని నిజంగా వెల చెల్లించి కొన్నవారిని వేళ్ళ మీద లెక్కించవచ్చు.

రెండువేల రూపాయిల కరెన్సీ నోట్లూ సాహిత్యరూపాల్ని ధరించి కట్టలు కట్టలుగా కొంపలో నిలవ ఉన్న కారణాన ఇల్లు చాలా ఇరుకైంది. భావకవిత్వం నల్లులకు ఎంతో ఇష్టమేమో? కవితలోని శృంగారాన్ని చదివి వంశాభివృద్ధి కార్యక్రమాల్ని అవి తీవ్రంగా అమలు జరిపినవి. పుస్తకాలలోంచి భావకుని తలకాయలోంచి వచ్చిపడే ఆలోచనా తరంగాలవలె పుట్టలు పగిలిన విధంగా బైటపడిన నల్లులు ఇల్లంతా అల్లుకొన్నవి. ఈ బాధపడలేక నల్లుల కారణంగా శరీరాలు పూర్తిగా గుల్లలు కాకముందే, ఇల్లాలు ఇద్దరు పిల్లల్నీ తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది. నలుగురినీ పీక్కు తినే నల్లులు తన నొక్కణ్నే పీక్కుతిన నారంభించినవి. రాత్రులు నిద్రపోనీక కవిత్వాన్ని గూర్చి ఆలోచించపజేయటం కవిత్వోపాసనకు ఆరోగ్యకరమైన చిహ్నమే కాని, ఆరోగ్యానికి యెంతో భంగకరమనే విషయం రుజువైంది.

'పుస్తకాలకు నల్లులు కాకుండా చెదలుపట్టి ఉంటే బాగుండేది' అనిపించింది. అయితే భావకవిత్వం కేవలం నల్లులకే ఇష్టమైతే తనేం చేయగలడు? అధవా అది చెదల క్కూడా ఇష్టమైన పక్షంలో అవి యీ కవిత్వాన్ని మాత్రమే ఆరగించి ఊరుకునేవికావు. ఇంట్లో ఉన్న ఇతర పుస్తకాలనూ, గుడ్డలను కూడా విందారగించి ఉండేవి! ఆ విధంగా చూస్తే చెదలకన్న నల్లులే నయ మనిపించింది!

కాంప్లిమెంటరీ కాపీలు యివ్వదగిన మిత్రులు ఆ ఊళ్ళో మరి లేరు. ఇతర ఊళ్ళకు పంపేందుకు పోస్టేజికూడా భరించవలసి వుంటుంది. పుస్తకాల కట్టలు వొదలకపోతే మరి లాభం లేదు. అప్పులిచ్చినవారికి కనిపించకుండా కట్టల వెనకాల దాక్కోవటం మినహాగా, యీ కట్టల గుట్టలవల్ల మరో ఉపయోగమూ లేదు. అందుకని సెకండ్ హాండ్‌లో వాటిని వొదిలించేందుకు శివరావు నిశ్చయించుకున్నాడు.

సెకండ్‌హ్యాండ్ వ్యాపారి ఆ కట్టల్ని చూసి మూర్ఛపడబోయి అంతలోనే తమాయించుకొని పెదవి విరిచాడు. త్రివర్ణ ముఖచిత్రాలతో ఉండే పాకెట్, లేక జాకెట్ పుస్తకాలకు తప్ప ఈ క్రౌనుసైజు – అందులోనూ కవిత్వం అసలు నడవ దన్నాడు. అందులోనూ ఆకలి కవిత్వ మొచ్చి శృంగారాన్ని తుడిచేసిం దన్నాడు. ఆకలి తీరాక కదా ప్రణయం అనే అభినయాన్ని వెల్లడించాడు. పైగా మానవ రక్తాన్ని మాత్రమే ఆహారంగా ఉపకరించే నల్లులు కోకొల్లలుగా ఉన్నందుకు భయపడ్డాడు.

ఇదంతా విన్నాక శివరావు గుండెలు జారినవి. తన ఈ కవిత్వం వల్లే యీ జీవితమంతా విడనాడక – తననూ, తన కుటుంబీకుల్నీ పీకి, పీల్చి, పిండి

చేస్తుందేమోనని భీతిల్లాడు. కొన్ని వందల రూపాయలన్నా వస్తాయనుకున్నాడు; ఇప్పుడు ఈ సెకండ్ హాండు బుక్ కిల్లర్‌గాడికి ఉచితంగానైనా ఇచ్చేమార్గమేదైనా వున్నదా అనే తీవ్రాలోచనలో పడ్డాడు. 'హతవిధీ! కవిత్వానికి ఏం దుర్గతి పట్టిందయ్యా!' అనుకున్నాడు మనస్సులో.

అంతలోనే సెకండ్‌హాండు బుక్ కిల్లర్‌గాడు ధోరణి కాస్త మార్చాడు: "తమ కవిత్వం అద్భుతమని అనేకులు అంటూండగా విన్నాను సార్!" అన్నాడు.

ఎవరా అన్నవాళ్ళు? తన ఎదుటి కొచ్చి అనరేం? తన వాల్యూములు చదవకపోతే మానె - చదువుకొని తిరిగి తెచ్చిస్తామని తీసుకువెళ్ళి - మళ్ళీ ఇవ్వకుంటే తానెంత ఆనందించేవాడు! కవిత్వం వేసిన చురకలకు ఇప్పుడిప్పుడే తాను కాస్త తెలివిగా, తార్కికంగా ఆలోచించ గలుగుతున్నా డనిపించింది.

"తమది చాలా బరువైన సాహిత్యం!" అని సెకండుహాండు (నిజానికి తన పుస్తకాలు ఫస్ట్‌హాండు - వీడి హస్తం పడుతుండగా అవి సెకండ్ హాండు అవుతవి) పుస్తకాల వ్యాపారి లాల్చీ పక్కజేబులోంచి, యమపాశాన్ని గుర్తుకుతెచ్చే స్ప్రింగ్‌బాలెన్స్ తీశాడు.

తన కవితా కన్యను (కన్యేమిటి తన శార్ధం! దాని కన్నెచెర ఎన్ని హెడ్డింగులకింద తానుకవితా వ్యాసంగాన్ని సాగించాడో అంతమంది పిల్లల్ని కన్నా అవ్వయి ఉండాలి ఈపాటికి!) కేవలం తూకానికి కొనేందుకు యీ వ్యాపారిగాడు సిద్ధపడ్డా దన్నమాట! ఇంకా వందల లెక్కలో యీ పుస్తకాలు వదులుతాయేమోనని తాను ఆశించాడు. ఇప్పుడు 'కాదూ కూడ' దంటే ఈ సాహిత్యపు బరువు ఇంకా తన భుజస్కంధాల మీదనే ఉండి, నల్లుల వర్షాన్ని కురిపిస్తూనే ఉంటుంది.

"ఎట్లా?" అన్నాడు శివరావు నీరసపడిపోయి.

వ్యాపారి వెకిలి నవ్వు నవ్వి "చూశారూ! ఈ పుస్తకం చిన్నది వేరు శెనక్కాయలు కూడా కాదు, వాటి పప్పుల పొట్లాలకుతప్ప ఈ కాగితం మరెందుకూ పనికిరాదు. అందుకని మణుగు రెండున్నరకన్నా పడదు కవిగారూ! ఈసారి దీనికి డబుల్‌సైజులో వేయించండి. అప్పుడు మాత్రం మూడు రూపాయలదాకా ఇవ్వగలను!" అన్నాడు.

ఇంకా అచ్చు వేయటమే! వీడు - ఈ వ్యాపారి తనను ఎంత మూఢుని కింద జమకడుతున్నాడో స్పష్టంగా తెలుస్తూనే ఉన్నది.

"రేటు మరీ అధ్వాన్నంగా ఉందే?" అన్నాడు శివరావు సణుక్కుంటూ.

వ్యాపారి గొంతుక్కూర్చున్నవాడల్లా లేచి నిలబడ్డాడు.

శవవాహకునివలె వచ్చి, ఆ శవాన్ని లాగెయ్యకుండానే వెళ్తుంటే ఎంత కష్టమవుతుందో శివరావు బాధ అలా తయారయింది.

"సరే, కానీ–"

కట్ట తర్వాత కట్టగా తూకం వేశాడు ఆ వ్యాపారి. తూకంలో కూడా మోసం ఉన్నట్లే తోచింది కవిగారికి. ఏమన్నా అంటే వ్యాపారం చేయకుండా వెళ్ళిపోతాడేమోనని శివరావు భయం.

"ఇన్ని పుస్తకాలు యెవ్వరూ కొనరండీ!" అన్నాడు వ్యాపారి.

ఒక్కవిషయంమాత్రం శివరావుకు స్పష్టమైంది. ఫస్టుహాండు కన్న సెకండ్‌హాండ్‌లో పుస్తకాలకు అమ్మకం యెక్కువ. ఈసారి వేస్తే సెకండుహాండు పుస్తకమే వేయాలి!

మొత్తమంతా పౌనుల్లో కూడాక "నల్లుల బరువు కనీసం అయిదు పౌనులన్నా ఉంటుంది. కనుక అది తీసెయ్యా" లన్నాడు వ్యాపారి. శివరావుకు ఇది న్యాయంగానే తోచింది. ఎంత రక్తం అవి తాగి ఉంటాయో అంచనాలు వేస్తే, నిజానికి మరో అయిదు పౌనులు కూడా తీసెయ్యవచ్చు.

రాగాపోగా మొత్తం ముప్ఫయి రెండు రూపాయల చిల్లర వచ్చింది. చిల్లర తన బక్షీసుకింద వేసుకొని ముప్ఫయి రెండు ఇచ్చాడు వ్యాపారి. ఫెదర్‌వెయిటు పేపరు కావటంవల్ల బరువు రాలేదు; బోడిసాహిత్యం! తనది బరువైన సాహిత్యం అన్న ఈ వ్యాపారిగాడిక్కూడా ఆ బరువు తెలిసిపోయింది. సాహిత్యోపాసనకు ఆ క్షణంలోనే స్వస్తి చెప్పాడు శివరావు. రాసి పడేస్తే యెప్పటికైనా అచ్చు వేయించవలసిన ఖర్మ నెత్తిమీద ఉంటే – నల్లులూ, తూకం, ఇల్లాలిపోరూ మొదలైనవి తనను చుట్టుముట్టే ప్రమాదం ఉంటుంది గనుక కలంతో కవిత్వంమాత్రం రాయకూడదని ప్రతిజ్ఞ పట్టవలసి వచ్చింది. తన సాహిత్యం తరలిపోతూంటే – పాలివ్వని పశువును కసాయివాడు తోలుకు పోతున్నప్పుడు ఆసామి మనస్సు యెలా వుంటుందో శివరావుకు ఇప్పుడు బోధపడింది.

బిడ్డ చచ్చినా పీతికంపు పోలేదన్న విధంగా పుస్తకాల కట్టలు తరలి పోయినా గోడల్ని ఆశ్రయించుకున్న నల్లులు వదలలేదు. ఇది పని కాదని శివరావు యిల్లు మార్చి ఇల్లాలిని పిలిపించుకున్నాడు.

"మీ బోడి సాహిత్యం విలువ ముప్ఫయి రెండు రూపాయలన్న మాట!" అన్నదతని యిల్లాలు. "రెండు వేలు తగలేసి – కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ముప్ఫయి రెండు సంపాయించారు! ఎకరం పొలం అమ్మి చేసిన నిర్వాకం ఇది! రెండువేలకూ – రెండు చంద్రహారాలూ వచ్చేవి!" అని ఆమె మెడ తడువుకున్నది.

కవిత్వమంటూ రాసినవాడు కనుక శివరావు దూషణ భూషణలకు అతీతుడుగా ఉండక తప్పలేదు.

-నాటికి నేడు యెవరో తనను 'కవిసార్వభౌములు'గా పేర్కొంటే, కవిత్వానికి చుట్టూ వున్న ఆనాటి తామరతంపరంతా జ్ఞాపకం రాక తప్పలేదతనికి.

ఎవరో ఏ రోడ్డు పక్కనో కారుచౌకగా వచ్చిందని తన పుస్తకం చదివి తనను 'కవిసార్వభౌమా!' అని సంబోధించబుద్ధయి ఈ వుత్తరం రాసి వుండవచ్చు. సెకండుహాండులో సర్క్యులేషన్ అత్యధికం కావటం, ఫస్టుహాండులో - అంటే సింహద్వారాన ప్రజల మనసుల్లో జొరబడలేని వారికి సెకండుహాండు - అంటే దొడ్డిదోవన ప్రవేశం కలిగే అవకాశం వుండటం ఒక వీలైన పద్ధతి. ఆంధ్రకవుల కీర్తి చచ్చాక కాని రాణించదనేది నిజమే ననిపించింది. ఎందుకంటే తను కవిగా చచ్చి రెండేళ్ళయింది. ఇప్పుడు కదా తన కీర్తిని తాను చెవులారా వింటోంది, (తను నిజంగా పోకపోవటం ఒక ప్రత్యేకత, అదృష్టమూను)

ఈ రాసింది యెవరా అనే ఆతృతతో వుత్తరం చివరి సంతకం చూశాడు; ఆ దెబ్బకు ఒకింత మూర్ఛిల్లాడు కూడాను. ఎందుకంటే 'విద్యుల్లత' అనే సంతకం నిజంగానే మెరుపుతీగెను ముట్టుకున్నంత షాక్ తినిపించింది.

నమ్మకం కలగని కళ్ళకు గట్టి నమ్మకం కలిగించేందుకు ఉద్దేశించబడిన తెల్లని కాగితం మీది నల్లని అక్షరాలు చెక్కుచెదరటంలేదు. కవిగాడి భావాల్లోంచి సజీవతను పొందిన కవితా కన్య (?) అతనికి సాక్షాత్కరించింది. వంకర్లూ, కొంకర్లూ తిరిగిన తెలుగు అక్షరాల జిలిబిలి రాత వొంపులు, సొంపులు దిద్దుకున్న నవయవ్వని ఆ ఉత్తరంలోంచి అతనికి సాక్షాత్కరించటమే గాక - మృదుమధురమైన తన గాత్రంతో వీణాతంత్రుల వలె ధ్వనించేవిధంగా నిండు పున్నమినాటి చందమామను బోలిన ఆమె ముఖంలో రెండు వొంపులు తిరిగిన సెలయేటి చందాన ఉన్న ఆమె చిన్ని నోరే ఆ వుత్తరాన్ని స్వయంగా చదివి వినిపించింది. (ఇలాటి సంఘటన సినిమాల్లో చూడటంవల్ల పిక్చరైజేషన్‌లో అది యెలా ఉండాలో నిర్ణయించిన అతని ఊహే ఇందుకు కారణమై ఉండొచ్చని తెలివిగల మా పాఠకులకు వేరుగా వివరించ నవసరం లేదనుకుంటాను)

"రెండేళ్ళక్రితం తమ కవిత్వం చదివి సమ్మోహిత నయ్యాను. ఆనాటి నుంచీ తమ దర్శనం యెన్నటికన్నా అవుతుందా అనీ, అంతవరకు యీ ఇలలో, కలలే శరణ్యమనీ తేల్చుకొన్నాను. వారంరోజులక్రితం మీరు మా వీధినపోతూంటే యెవరో ఫలానా అని చెప్పారు. నిజం చెప్పొద్దూ! కవిత్వం యెంత పసందుగా ఉంటుందో వ్యక్తి అంత వికారంగా ఉంటాడని తలపోసిన నాకు ఆశాభంగమే అయింది.

"నవయవ్వన సుందర రూపంలో నుంచే ఇంత రసవత్తర కవిత్వాన్ని అందించేందుకు నిర్ణయించిన విధిని యెంతో మెచ్చుకున్నాను. మీరు నన్ను

రెండువిధాలా ఆకర్షించారు. కవిత్వంతో హృదయాన్నీ, ఆత్మనూ ఆకట్టుకున్నారు; రూపలావణ్యంతో శరీరానికి పులకలెత్తించారు.

"మీ కవిత్వం చదవకపూర్వమే నాకు వివాహ మవటం ఒక దురదుష్టం. నా భర్త అరసికుడని వేరుగా వివరించ నవసరంలేదు. అయితే నన్నంత గాఢంగా, బలంగా ఆకర్షించిన మీకు దూరదూరంగా ఉండటం కన్నా ఆత్మహత్య నయమనిపిస్తోంది. కోర్కెల తీవ్రత - అందునా ప్రణయ తీవ్రత ముందు మన సామాజికాచారాలూ, కట్టుబాట్లూ చట్టాలూ-అందాకా ఎందుకు, సామాన్యమానవులమైన మనమే యెంతో అల్పులమైపోతాము. లేక వాటిని తీర్చుకునే అవకాశాలను కష్టపడి సాధించి, అనుభవించి రసికులమై పోతామేమో మీరే స్వయంగా వివరించాలి. మీకూ వివాహమై పోయిందని విన్నాను. కనుక మన ప్రణయం అతిపవిత్రమైనది కాకున్నా కనీసం దాని ధోరణిలో అది పవిత్రమైనదిగానే ఉండగలదని నా నమ్మకం.

"ప్రవరుణ్ణి చూసిన వరూధిని అంతర్యం కూలంకషంగా తెలిసిన మీకు నా మనస్సును ఇంకా విప్పిచెప్ప నవసరంలేదు. మీ శృంగార కవిత్వంలోని రసికత్వాన్ని తృప్తిదీరా అనుభవించాలని తహతహ లాడుతున్నాను."

"రేపు మా ఆయన కాంపుకు వెళ్తున్నారు. రేపు సాయంత్రం అయిదింటికి మిమ్ము మా ఇంటికి ఆహ్వానిస్తున్నాను. ఆ తరువాత విషయాలు మదనుని కదనంలో ముఖాముఖీ, బాహాబాహి మన శరీరాలే మాట్లాడుకుంటవి."

"రసికులు నా ఆహ్వానాన్ని తిరస్కరించరనీ, కాముని కదనానికి వెన్నివ్వరనీ గాఢంగా నమ్ముతున్నాను.

మీ దాన్ని
విద్యుల్లత."

నిజానికి కొంచెం చలిచలిగావున్నా శివరావుకు చిరుచెమట్లు పట్టినవి.

అసలీ వుత్తరం తనకేనా ననే మొదటి సందేహం తీరేందుకు కవరు మీద ఎడ్రస్ చూశాడు. తన పేరూ, పేటా స్పష్టంగా వున్నవి. ఎటొచ్చీ ఇంటిపేరు లేదు. తనలాటి జగమెరిగిన బ్రాహ్మడికి జందె మెందుకు అనిపించి సరిపెట్టుకున్నాడు.

ఆ తరువాత ఉత్తరంలోని విషయాలను మరో రెండుసార్లు పరిపూర్ణంగా చదివి ప్రతి అక్షరమూ అర్థం చేసుకొని ఆయా వాక్యాలను తనలో తను తర్కించుకోసాగాడు.

తన రచనలు చదివి ఆమె సమ్మోహిత కావటం నమ్మదగని విషయమేమీ కాదు. తాను రచనల్లో వొలకబోసిన శృంగారమంతా ఆమె మనస్సునుబట్టి అయితేనేం, తత్వాన్ని బట్టి అయితేనేం, ఆలోచనా ధోరణి అయితేనేం ఎంతో నచ్చి ఉండొచ్చు. అందుకనే మెచ్చి ఉండొచ్చు. కొంతమంది పాఠకులకు కొన్ని కొన్ని రచనలు యెంతో బాగుండవచ్చు. తన కొద్దిమంది పఠితల్లోనూ ఈమె ఒకతె అవవచ్చు.

ముఖ్యంగా సెకండుహాండు వ్యాపారి కారుచౌకగా తన పుస్తకాన్ని తూకానికి కొని, అంత కారుచౌకగానూ సర్క్యులేషన్‌లో పెట్టి వుండడంవల్ల జనబాహుళ్యానికి అందుబాటులోకి వచ్చి తనకు పాఠకుల సంఖ్యను పెంచింది. చౌకగా అమ్మే అవకాశమున్న ప్రతివస్తువూ నలుగురికీ చేరుతుందనే సత్యం రుజువైంది. సాహిత్యానికి నిజమైన ప్రచారం సెకండుహ్యాండు వ్యాపారి చేతుల్లోనే ఉన్నది. ఈ వాటం కనిపెట్టే అమెరికా, రష్యా మొదలైన దేశాలు దాదాపు తూకానికి అమ్మేరేటుకు తమ తమ సాహిత్యాలను ఓడల పరిమాణాల్లో ఇతర దేశాలకు సరఫరాచేసి బహుళ ప్రచారం సాధిస్తున్నవి!

ఏమైతేనేం తాను రచయితగా చలామణి అయే రోజుల్లో లేని మెప్పుకోళ్ళు ఇప్పుడు వరదరూపాన వచ్చిపడి ఊపిరాడనంత పనయింది. అజ్ఞాతంలో పడిపోయి ఉన్న రచయిత ఒక్కసారిగా సమాధిలోంచి లేచి భూతంవలె విరుచుకు పడుతున్నాడు. మళ్ళీ రచనలు సాగించాలని చేతులు గులగుల్లాడినా - ఉన్న ఎకరంన్నర పొలమూ, కోరమీసాల సెకండుహాండు పుస్తకాల వ్యాపారీ గుర్తుకు రావటంతో వేళ్ళు కాస్త వెనకాడినవి.

వారంరోజులక్రితం బహుశా ఆ వీధిన నడిచి ఉండొచ్చు! అప్పుడామె తనను చూసి తీవ్రమైన మోహానికి గురయ్యానని చెపుతోంది! వరూధినీ ప్రవరుని వ్యవహారంగా ఆమె చేసిన పోలిక అత్యద్భుతం. ఆమెలో కూడా రసజ్ఞతా, కవితా శక్తీ, యుక్తీ ఉన్నవనేది సుస్పష్టం.

అయితే తాను ఏమంత పెద్ద అందగాడేం కాదు. మరి ఆమె కంటికి నవమన్మథునివలె కనిపించి ఉంటాడంటే నమ్మదగ్గ విషయంగా తోచలేదు. కాని ఇలాటివి నమ్మకుంటే మనసుపొందే ఆవేదన, బాధ నమ్మేట్లుగా చేసేవరకూ ఊరుకోవు కదా!

ఎందుకైనా మంచిదని పడకగదిలో వున్న నిలువుటద్దం ముందు నిలబడి తను అందంగా కనిపించే ఏంగిల్స్‌లోకి వొంగి అద్దంలో తొంగి తొంగి చూసుకొని, తానుకూడా అందగాడేనని తీర్మానించుకున్నాడు. ఇది కేవలం తన తీర్పు; బహుశా ఆమెకూడా తనను-తాను మెచ్చుకొన్న ఏంగిల్స్‌లోనే చూసి మనోవికారానికి గురై ఉండొచ్చు. అంతకుపూర్వమే తన రచనలూ, అందులోని శృంగారమూ ఆమెను లోబరుచుకొని ఉండటంవల్ల తను సాక్షాత్కరించినప్పుడు ఆ ఊహించుకొన్న అందచందాలను కూడా తన రూపురేఖా విలాసాలతో పెనవేసుకొని మోహనాకారుడని అభిప్రాయపడే వుండొచ్చు.

అసలు అందమంటే ఎవరి కొలబద్ద వారికే ఉన్నది. ముఖ్యంగా కంటికి కనిపించేది మాత్రమే అందమనుకోవటం కేవలం అజ్ఞానం. హృదయ సౌందర్యం,

ఆత్మసంస్కారం మొదలైనవికూడా లెక్కకు వస్తవి. ఆ మాటకొస్తే ప్రవరుడు బూడిదగుమ్మడికాయలాటి తలతో, పిలకతో, విభూది రేకలతో, కాషాయవస్త్రాలతో గున్న మామిడిచెట్టును గుర్తుకుతెస్తూ, పొన్నకాయల్లే ఉండేవాణ్ని – చూసీ చూడగానే – అందాలరాశి, దేవకన్య నవయవ్వని కళాపిపాసి వరూథిని ఎందుకు తలక్కిందులుగా ప్రణయ సాగరంలో పడిందీ? ఈనాడు ఆ ప్రవరుడే సాక్షాత్కరిస్తే మెరకవీధిలోని మురికి సరుకుకూడా చికాకుపడుతుంది. కనుక తాను మెచ్చింది, రంభ అనే సిద్ధాంతం ప్రకారం ఈ విద్యుల్లత తన ప్రణయబంధంలో పడిన పిట్ట అయింది! ఏయే కారణాలవల్ల ఎవరి కంటికి ఎవరు అందంగా ఉండగలరో చెప్పటమెలా?

ఈ విధంగా తాను విద్యుల్లతకు స్వప్నసుందరు డయ్యా డనేందుకు ఆమె స్టేటుమెంటే ప్రబల సాక్ష్యం. అందులో సందేహ పడవలసిం దేమీలేదు. పోతే ఇప్పుడు తనను పట్టి పీడించే సమస్య ఏమిటంటే ఈ విద్యుల్లతను తాను స్వయంగా చూడలేదు. ఆమె ఎంత అందగత్తో, లేక వికారో తనకు తెలియదు. అందవిహీన అయే పక్షంలో ఆమె కంటికి తాను నవయవ్వనుడైన రాకుమారుడుగానే తోచి ఉండొచ్చు.

పేరునుబట్టి మనిషి అందచందాలు అంచనాలు వేయటం చాలా పెద్ద పొరపాటని స్వానుభవం చెపుతూనే వున్నది. వికారంగా ఉండే స్త్రీ పేరు 'సుందరి' అవవచ్చు. ఈ పేర్లు ఎవరికీ స్వంతంకానీ, వాటిమీద కాపీరైట్ హక్కుల్లాంటివి కానీ, కనీసం ఎవరి అనుమతన్నా పొందవలసిన అవసరం కానీ లేకుండటమూ, సరిగ్గా విరుద్ధ ధ్వనిని ఇచ్చే విధంగా పేర్లు పెట్టుకున్నా అడిగే దిక్కూ, దివాణమూ లేకుండటమూ తాను ఎరిగి వున్న విషయమే!

ఉత్తరం చదివి ఆమె కళాహృదయాన్నీ, సంస్కృతినీ మెచ్చుకొని ఆమెను ఊహల్లో తన కవితా నాయకిగా, స్వప్న సుందరిగా రూపొందించు కున్నమాట నిజమే. వలచివచ్చిన వనితని ప్రవరునివలె అలుసు చేయకుండానే, ఆమెపట్ల తన ఆపేక్షనూ, ప్రణయాన్నీ, ఉద్వేగ ఉద్రేకాలను పెంపొందించుకొని కవితావేశానికి వీటిని జోడించి కొద్ది క్షణాలు ఊహకాశంలో ఊయల లూగి, అంతలోనే కాలికింద గట్టి భూమి ఉన్నదని నిశ్చయంగా తెలుసుకొని కిందికి దిగాడు – శివరావు.

ఈ తర్కాల ప్రకారం తాను ఆమెను శరీరం లోపల దాగి ఉన్న మనస్సునూ హృదయాన్నీ కవిత్వంతోనూ, బైటికి కనిపించే శారీరక భాగాలతో శరీరాన్నీ ఆకర్షించా డనేది రుజువైంది. ఇది కేవలం తన ఊహ మాత్రమే కాదు. ఉత్తరంలోని 3వ పేరా యీ విషయాన్ని నిస్సందేహం చేస్తున్నది.

ఇక రుజువు కావలసిందేమిటంటే ఉత్తరంలో 6 వ పేరాలో ఉదహరించిన .... 'మదనుని కదనంలో ....బాహాబాహి' వ్యవహారంలో తన రసికత్వాన్ని ఎన్ని విధాలుగా వొలకబొయ్యాలో ప్రత్యక్షంగా నిరూపించడ మొక్కటే.

ఈ ఆహ్వానంతో మనసు చలించి, వొళ్ళు పులకరించి సలపరం పుట్టిన మాట నిజమే కాని - మరింత లోతులకు వెళ్ళి ఆలోచిస్తే పైకి కనిపించే తళతళల వెనుక ఉన్న నికరమైన ముడిసరుకు తాలూకు వికారమూ, ప్రమాదంకూడా పొడచూపినవి.

పెళ్ళి చేసుకొని భర్తచాటున ఉండే భామ, వలచి పిలిచినా, వెళ్ళటం ధర్మమా అనేది మొదటిప్రశ్న. అనుభవాలకూ, ధర్మాధర్మాలకూ, పొత్తు కుదరదు. సమానాంతర రేఖలవలె అవి ఎన్నటికీ కలుసుకోవు. ఒకో కొత్త అనుభూతి కొరకు, ఒకో ధర్మాన్ని అతిక్రమించి తీరాలి. ఆమె కోరికలోనే ఆ విషయం రుజు వవుతోంది. ధర్మవిచారణ మాటకొస్తే ఆమె అధిగమించే ధర్మం, తాను వదులుకోవలసిన నీతికన్న అత్యధికం. అయితే ఆమె నిర్ణయం ఆమెది; తనదానికి తానే బాధ్యుడు.

ఇక ప్రమాదమంటే - ఎవరి సంసారాల్లో వారు కష్టసుఖాలను అనుభవిస్తూనే కాలం గడుపుతూ సామాజిక శాంతిభద్రతల్ని కాపాడుతున్నారు. విచ్చలవిడి వ్యవహారమే కనుక అయితే ఎంత గందరగోళంగా యీ గోళం రూపొంది ఉండేదో ఊహించటానికే భయంకరంగా ఉంటుంది. భార్యా భర్తల్లో ఏ కారణం చేతనైనా ఎవరో ఒకరు తప్పుదారి పట్టేట్లయితే రెండోవారు సరిదిద్దటం, లేదా, ఇరుగుపొరుగుల పెద్దమనుషులు రాజీ చేయటంలాటివి జరుగుతూనే వున్నవి. అంతేకాని చీటికీ మాటికీ ఏవో క్షణికోద్రేకాల కారణంగా సంసారాలు విచ్ఛిన్నం కావటంలేదు కదా!

ముఖ్యంగా కుటుంబ గౌరవ మర్యాదల్ని కాపాడే నిమిత్తం దంపతులు ఎంతో కృషి చేయటం తనకు తెలియనిదేం కాదు. భర్త జూదగాడై, తాగుబోతై, క్రూరుడై - చివరకు నపుంసకుడు అయినప్పటికీ ఏదో రకంగా సర్దుకొని వెళ్ళే ఇల్లాళ్ళు తన తలవెంట్రుక లంతమంది ఉన్నారు. సంసారం చితికి పోకుండానే, బజారుపా లవకుండానే ఎవరి కోరికల్ని వారు చాటుమాటుగా తీర్చుకునే రకాలూ ఉన్నవి. ఇక్కడ కోర్కెలకూ, సామాజిక శాంతికీ ఒక ఘర్షణ వున్నది. సమాజం కళ్ళు కప్పి కోర్కెలను తీర్చుకోవటం ఉత్తమమైన పద్ధతిగా శతాబ్దాల తరబడి మానవుడు ప్రయోగాత్మకంగా రుజువుచేసే వున్నాడు. అంటే సంసారం చెడకుండానే తెలివిగా మేనేజ్ చేయడమన్నమాట!

ప్రస్తుతం విద్యుల్లత యీ తరగతిలోనే వున్నది. భర్తతో పొత్తు కుదరకున్నప్పటికీ, సంసారం పాడవటానికి ఆమె అంగీకరించని ధోరణి స్పష్టంగా తెలుస్తూనే వున్నది. అందుకనే భర్త కాంపుకు వెడుతున్నాడు కనుక ఉపభర్తగా తన కీ ఆహ్వానాన్ని పంపించింది.

అయితే విధివశాన ఆ భర్తగాడు సాక్షాత్కరిస్తే తన గతేంకాను? ఇల్లు విడిచి వెళ్ళలేని ఇల్లాలి వ్యవహారం తరువాత చూసుకుంటాడా అరసికుడైన భర్త. ముందు తన భరతం పట్టించి ఆ అరసికత్వాన్ని పెద్ద పెద్ద డోసుల్లో ప్రయోగిస్తే శారీరకంగానేగాక

మానసికంగా కూడా తాను ఎంతో వేదనను అనుభవించవలసి వుంటుంది. కాపరాలు తీసే కవిగాణ్ణి, వాడి కవిత్వం ఎంత గొప్పదైనా సమాజం శిక్షించి తీరుతుంది. జేరిన నలుగురూ తమ సంసారాల మీదనే యీ దాడి జరిగిందన్నంత కసితో, భార్యల పాతివ్రత్యాన్నే భంగపరిచేందుకు సిద్ధపడిన విలాసపురుషుడనే ధోరణిలో సున్నంలోకి బొమిక లేకుండా నలగబొడవటంతో వదిలితే అదృష్టవంతుడే. పోలీసుస్టేషన్‌కు నడిపిస్తే ఇక తన తల నరికినట్టే భావించవలసి వుంటుంది!

ముక్కూ, మొహమూ తెలియని ముత్తయిదువ పోస్టులో పంపిన ఆహ్వానాన్ని అందుకొని, చంక లెగరేసుకుంటూ రేసుగుర్రమల్లే ఛంగు ఛంగున పరుగులెత్తటంలో ఉన్న 'రిస్క్'ను గూర్చి ఆలోచిస్తే వొంటిమీద గొంగళి పురుగులు పాకుతూన్నట్లే అనిపించింది. అయితే యీ రిస్కే ఆహ్వానంలోని ఆకర్షణ; థ్రిల్ కూడానేమో? అంత థ్రిల్‌ను తాను భరించగలడా?

లేక, తీరా ఈ విద్యుల్లతను చూశాక శరీరంలో నరాల అల్లిక నీటిధార పడిన పొంగే పాలవలె చల్లారిపోతే? ఆమె తననుకూడా తన భర్త కోవలోనే వేస్తుంది. ఆ విషయం తన నొక సర్టిఫికెట్ రూపాన జీవితమంతా వెన్నాడే నీడవలె ఉండేట్లు చేస్తుంది. ఈ విధంగా పొందే అవమానం క్షణికం కాదు. జీవితానికే సరిపడేటంత పెద్దదీ, తీవ్రమైనదీను. కనుక యిది ఆచరణ యోగ్యంగా తోచలేదు

తన కవిత్వం ఒక సంసార స్త్రీని కోరరాని కోర్కెలకు గురి చేసిందంటే దాని శక్తి నిజంగా అద్భుతమే! ఒక సన్మార్గిని దుర్మార్గిగా చేసేందుకేమి, దుర్మార్గిని సన్మార్గిగా తిప్పేందుకేమి సామాన్య శక్తులకు సాధ్యమా? ఆ విధంగా చూస్తే తన కవిత్వం నిజంగా గొప్పదే! కాని తాను కవిత్వం ద్వారా ఆశించింది ఇదా?

ఈ ఆలోచన రాగానే శివరావులోని సర్వశక్తులూ మూకుమ్మడిగా అతని మీద తిరగబడినవి. శృంగార కవిత్వమంటే, ఆ శృంగారాన్ని స్వేచ్ఛగా ఎటుపడితే అటు ప్రయోగించేందుకా? దాంతో పొందిన తన్మయత్వంతో, ఆవేశంతో, పవిత్రత చెడని ప్రణయాన్ని ఆరాధించటం కాని, కుక్కల సామెతగా వ్యవహరించమనా? ఈ కోణంలోంచి చూస్తే తన కవిత్వం తాను ఆశించినదానికి సరిగ్గా విరుద్ధ ఫలితాలను ఇచ్చింది!

యిరుగు పొరుగుల యువతుల్ని చూసి, వారి అందచందాలకు మెరుగులు దిద్ది ఊహల్లో వాళ్ళను తన ప్రియురాళ్ళుగా చేసుకొని, నాయకుడుగా తననే వుంచుకొని గుటకలు మింగుతూ కవిత్వారాధన, కవితోపాశన చేశాడు. నిత్యజీవితంలో తీరనివాటిని కవిత్వం ద్వారా తీర్చుకొని ఆ కోర్కెలు వింతవింత రూపాలు ధరించి కరుడుగట్టి తనను ముంచి పారెయ్యకుండా ఈ విధమైన విడుదల నొకదాన్ని ఏర్పరచి బాలన్స్ పోకుండా తనను తాను కాపాడుకున్నాడు. తన కవిత్వాన్ని చదివినవారు తాను

ఉద్దేశించిన వ్యక్తుల్ని బహుశా గుర్తించి వుండరు; ఆ మాటకొస్తే ఆ వ్యక్తులే తమను తాము గుర్తించి వుండకపోవచ్చు. తన శరీరం చెక్కు చెదరకుండా వుండటమే అందుకు తార్కాణం. లేక ఆ వ్యక్తులు మాత్రమే గుర్తెరిగి తమను కవిత్వం ద్వారా కూడా ఆరాధించే వాళ్ళున్నారని తమలో తాము గర్వపడ్డారేమో? కవితావస్తువు కావటమంటే సామాన్యమా మరి? ఏమైతేనేమి - ఎవ్వరూ తన ఎదుటపడి తమను కవితోపాసనకు ఇంధనంగా ఉపయోగించినందుకు ఫిర్యాదు చేయలేదు. తన ఆనందం తనదిగా ఉండనిచ్చినందుకు తానెంతో కృతజ్ఞుడు కూడాను!

ఇదంతా సిద్ధాంత రీత్యా సాధించింది. విజయమో, కాదో వేరే సంగతి! నిత్యజీవితంలో తీరే అవకాశాలు లేనివాటిని తాను కవిత్వంలో తీర్చుకుంటే - యిప్పుడే విద్యుల్లత కవిత్వంలో తీరే కోర్కెల్ని నిత్యజీవితంలో తీర్చుకునేందుకు - అందునా ఆ ఊహలకు కర్త అయి తన ద్వారానే అవి సిద్ధింప జేసుకునేందుకు సంసిద్ధ అయింది! ఈ వుత్తర దక్షిణ ధ్రువాల కలయికా, అన్వయం ఎలాటి విపత్కర పరిణామాలకు దారి తీస్తుందో?

తాను రాసిన కవిత్వం సాధించేది ఇదే ననేందుకు విద్యుల్లత సజీవ సాక్ష్యం. ఇలాటి ఇల్లాళ్ళు మరికొంతమందికూడా ఉండివుండాలి. గాలానికి పడింది ఒక చేప అయితే, నదిలో గుంపులు గుంపులే ఉండి వుండాలి మరి! ఇలాటి అప్లికేషన్స్ తనకు యిదివరకు రాలేదు. బహుశా అవి అందుబాటులో ఉన్న మరికొంతమంది విలాస పురుషులకు అంది వుండొచ్చు. వారు ఆనందించి వుండొచ్చు. తమ కోర్కెల శిఖరాలకు అనుగుణంగా ఉండే విధంగా సోపానాల మాదిరి యేర్పరిచిన గేయాలకు అభినందనలు చెప్పుకొని వుండొచ్చు. పేవ్‌మెంట్సు మీద పడేసి అమ్ముతూన్న సాహిత్యాన్ని కొని తాము గురి చూసిన ఇతర ప్రేమపక్షుల మీదికి కూడా దాన్ని ప్రయోగించి, వాటిలో కొన్నిటిని పడగొట్టి, వశం చేసుకొని వుండొచ్చు.

ఇదంతా తలుచుకుంటే శివరావుకు కంపరమెత్తింది. తన సాహిత్యం చేసిన కల్లోలానికి భూమే కంపించిందా అనిపిస్తోంది. ఇదే నిజమనుకుంటే (అనుకోక తప్పేందుకు ఏ తర్కమూ సహాయపడలేదు మరి!) దీనికంతకూ కర్త అయిన తన బాధ్యతలను విస్మరించటం ఎలా? అణుబాంబును కనిపెట్టి, దాని రహస్యాన్ని వెల్లడించినవాడే అది చేసే కీడుకు పరోక్షంగా బాధ్యుడు కదా! కనుక తన సాహిత్యం ద్వారా శివమెత్తిన వారిని శాంతింపచేసే గురుతర బాధ్యత కూడా తనకు వున్నది.

ఈ ప్రశాంతిని సాధించేందుకు పతితల వెర్రిమొర్రి ఆలోచనలతో నిర్మితమైన కోర్కెల్ని తీర్చటం తన పని కాదు. ఈ కోవలోకి వచ్చిన కుసుమ సుందర కోమలాంగులకు - వారు కోరిన పత్యమిచ్చి చికిత్స చేసేందుకు తాను సంసిద్ధు

డైనప్పటికీ, కురూపులుగా ఉన్నవారికి కూడా ఇదే చికిత్స అని నిరూపించలేడు తాను. అందుకని అందరికీ పనికివొచ్చే చికిత్సా విధానాన్ని ఏర్పరచాలి!

అలాటి చికిత్సను గూర్చి తీవ్రంగా ఆలోచించవలసిన అవసరం లేదు. సాహిత్యోపాసననుంచి విరమించాక, లౌకిక వ్యవహారాలతో శివరావు మనస్సు నిశితమైంది.

తన కవిత్వం ఉద్దేశించింది 'అది' కాదనీ, ధర్మపథాన్ని తప్పడమంత దారుణం మరి వుండదనీ, ఏమైనప్పటికీ పరస్త్రీలు తనకు తల్లులేననీ, ఇకనన్నా బుద్ధికలిగి సంసారాన్ని చక్కదిద్దుకోమనీ స్వయంగా విద్యుల్లతకు చెప్పాలి. ఈ పాడు కవిత్వాన్ని వ్రాసిన నేరానికి తనకిది తగిన శిక్ష – కాదు ప్రాయశ్చిత్తం!

ఈ నిర్ణయంతో శివరావు మనోభారం క్రమంగా తగ్గ నారంభించింది. స్వయంగా ఒక సత్కార్యాన్ని చేసేందుకు కావలసిన ఉత్సాహ ప్రోత్సాహాలూ, ఆవేశమూ, శక్తీ, వికాసమూ మొదలైనవి అతన్ని ఆవహించినవి. నైతిక కదన రంగంలోకి ఉరికేందుకుగాను ఆతృతతో సూర్యాస్తమయానికి ఎదురుచూడ సాగాడతను.

## 2

సమయం ఆసన్న మవుతూన్నకొద్దీ శివరావు గుండెలు కొట్టుకునే వేగం కూడా అధికమవసాగింది. తానెలా ఆమెను సమీపించాలి? ఎలా మాట్లాడి తార్కికంగానూ, సంతృప్తికరంగానూ మారుమాటాడకుండా అనుసరించే విధంగానూ చేయాలి? చివరకు తనకీ వింత కోర్కె కలిగినందుకు ఆమెను పశ్చాత్తాపపడేట్లు చేయాలి. చూస్తూ చూస్తూ అగ్నిగుండంలో పడకుండా కాపాడిన తన మేలుకు ఆమె కృతజ్ఞతను స్వీకరించి వికసించిన మనస్సుతో హాయిగా యెలా మరలిరావాలో ఆలోచించాడు శివరావు.

మదించిన ఆడది మదపు టేనుగులాటిది. సరైన అంకుశం లేకుంటే మావటీవాణ్నే హతమార్చినా ఆశ్చర్యం వుండదు. అయితే తాను ఏర్పరచుకొని పదునుపెట్టిన ఆయుధం ద్వారా తనకు విజయం లభించగలదనే ఆశ శివరావులో పూర్తిగా వున్నది. తన కవిత్వానికి స్వశక్తుల్నీ, స్వధర్మాల్నీ తప్పి వశమైపోయిన విద్యుల్లత తానిప్పుడు చెప్పదలచుకున్న మాటలకు మాత్రం వశం కాకుండా ఉంటుందా? తెల్లని కాగితంమీద నల్లని అక్షరాల ప్రభావానికే ముగ్ధురాలైన ముద్దుగొమ్మ తాను నోరారా చెప్పే ధర్మాన్ని తిరస్కరించ గలుగుతుందా? తనపట్ల వుండే అనురాగం, తన మాటల మీది గురీ తన తర్కం మొదలైనవాటికి ఆమె లొంగితీరాలి మరి!

కాని సాధారణ పరిస్థితుల్లో అయితే తాను సాధించదలచుకొన్నది అంత కష్టం కాదు. ఇప్పుడామె మకరాంకుని మైకంలో పడిపోయి ఉన్మాదినివలె వున్నది. కామిని

కామతాపంతో తహతహలాడే సమయంలో ఆమె మనసారా వాంఛించిన మగవాడు ఎదురుపడితే కొమ్ములతో పొడిచే పోకిరి ఆవు వలెనే ప్రవర్తిస్తుంది. తాను మనసులోంచి పూర్తిగా అలాటి పిచ్చి కోర్కెలను తుడిచిపారేసినమాట వాస్తవమే కాని, తనను చూడగానే ఆమె మీదపడి ఆసరా దొరికిన లతవలె తనను పెనవేసి పైపైకి పాకిపోతే? విద్యుల్లత తాకిడితో ఆ విద్యుత్ కూడా తన నరనరాల్లోకీ ప్రవహించి తనను తలకిందులు చేస్తే? చికిత్స చేయబోయే తానే ఆ వ్యాధికి గురైన వైద్యుని సామె తవుతుందేమో?

చదువు సంస్కారాలున్న సంసారి సిగ్గూ లజ్జా విడిచి అంత బహిరంగంగా, అసహ్యకరంగా ప్రవర్తించదు. అథవా అలాటి ప్రమాదమేదన్నా సంభవించినా, తన మనస్సు తన ఆధీనంలో ఉన్నంతవరకూ శృతి మించకుండా చూసుకోవచ్చు. కామ వ్యామోహంలో కన్ను గానని చిత్రాంగి సారంగధరుణ్ణి ఏం జేయగలిగింది? ఉద్రేకంతో ఊగిపోయిన ఊర్వశి పురూరవుణ్ణి ఏం చేయగలిగింది? వలపు తలపుల భారానికి లొంగిపోయిన వరూధిని ప్రవరుణ్ణి ఏం సాధించ గలిగింది? కాముక వ్యాపారంలో స్త్రీ పురుషుల్లో ఒక్కరు సహకరించకపోయినా అది కొనసాగనేరదనేది కాచి వడగట్టిన సత్యం. తాను చలించకుండటమే తనకూ, ఆమెక్కూడా శ్రీరామరక్ష.

అయితే తానుకూడా కేవలం రక్త మాంసాలున్న సామాన్య మానవ మాత్రుడు! మహా తపశ్శాలి విశ్వామిత్రుణ్ణే మేనక మోహపాశంతో బంధించింది! అమాయకుడైన ఋష్యశృంగునికి వేశ్య ప్రణయ పాఠాలు నేర్పించింది. అందుకనే కామించిన కామిని అంటే కొరకరాని కొయ్య అనే అభిప్రాయం. ఏమైతేనేమి - ఇది తనకొక అగ్ని పరీక్ష; నిప్పుల్లోకి దూకి వొళ్ళు కాలకుండా బైటపడటంలోనే తన ప్రతిభా, సామాజిక క్షేమం ఇమిడి వున్నవి.

ఈ గొడవంతా లేకుండా ఆ వుత్తరాన్ని భస్మంచేసి మెదలకుండా ఊరుకుంటే మంచిదేమో ననిపించింది శివరావుకు. తాను ఊరుకుంటే ఆమె ఊరుకుంటుందనే గ్యారంటీ ఎక్కడ? ఈసారి రిజిస్టర్డ్ ఉత్తరం, దానికీ జవాబు లేకుంటే సరాసరి తన ఇంటికి రావటం చేసినా చేయవచ్చు. ఉన్మాదదశలో - అందునా మదపిచ్చిలో - మానవుని ప్రవర్తనకు ఒక దారీ తెన్నూ వుంటుందా? మనస్తత్వ శాస్త్రానికి అతీతంగా పిచ్చిపిచ్చి పనులు చేసినా ఆశ్చర్యం అనవసరం!

ప్రపంచంలో కొంతమంది పాడుపనులు చేసే వాళ్ళూ, మరికొంత మంది ఆ పాప పరిహారార్థం మంచిపనులు చేసేవాళ్లూ ఎప్పుడూ వుంటూనే వున్నారు. తాను చేసేపని తాలూకు ఫలితాలు బైటపడినప్పుడే ఆ పని మంచిదో చెడ్డదో తేలేది. తాను యెన్నడూ కలలోకూడా తలవని దారుణ ఫలితాలు వచ్చిపడినందువల్ల తాను చేసింది పాడుపని అని ఇప్పుడు నమ్మవలసి వచ్చింది. దీన్ని సరిదిద్దటం వేరొకరి బాధ్యతగా

వొదిలివేయటం మరొక తప్పు చేయటం. తన కీ అవకాశా లున్నప్పుడు తను వ్యాప్తి నందించిన వ్యాధికి తానే చికిత్స నివ్వటం సర్వాంగీకారమైన విషయం.

సమాజంలో మూఢనమ్మకాలతో సామాజికుల నిత్యజీవితం కష్టభూయిష్ట మవుతూండగా, కొంతమంది సంస్కారులు బయలుదేరి, ఆయా సంస్కరణలను చేస్తూ, చెడిపోయిన బండిని మరామత్తులుచేసి సవ్యంగా నడిపించటం జరుగుతూనే వున్నది. ఇక్కడ తనే డ్రయివరూ, తనే మెకానిక్కూ. బహుశా లోక మరామత్తు తన శక్తికి మించిందే అయి వుండవచ్చు. కనీసం ఈ ఒక్క వ్యక్తినీ సక్రమ మార్గంలో నడిపించగలుగుతే తను ధన్యుడు. తనకా శక్తి కూడా లేదనుకోవటం తన అసమర్థత. ఫలితమేదైనా గట్టి ప్రయత్నమైనా చేయకుండటం అవివేకం కదా!

ఇంతమంది కవులూ, మహా కవులూ, ఛోటా కవులూ టన్నుల పరిమితిలో కవిత్వాన్ని దించారు. కాని బహుశా యెవ్వరికీ ఇలాటి విచిత్ర సంఘటన ఎదురై వుండదు. అలాటి దృష్టాంతర మేదైనా ఉంటే ఇప్పుడు తనకు కొంతవరకూ వుపయోగించేది. గండక త్తెరలో తలపెట్టిన ట్లయింది. తన పరిస్థితి చిత్రాతిచిత్రమైన స్థితిలో ఇరుక్కోవటం తన కిదే మొదటి అనుభవం. బహుశా చివరిదికూడా అవాలని తాను వేయిదేవుళ్ళకు మొక్కుకున్నాడు.

ఇంకా ఆలోచిస్తూ కూర్చుంటే లాభంలేదు. బయలుదేరవలసిన వేళ అయింది. రోగికిలేని భయం శస్త్రకారుడికి పట్టిన సామెతగా ఉన్నది శివరావు స్థితి!

చూడగానే అసహ్యించుకోకుండా తన పర్సనాలిటీ ఆమెను ఆకర్షించేదిగా ఉంటేనే తన మాటలమీద ఆమెకు గురి ఏర్పడుతుంది. రోగిని దర్శించే డాక్టర్లు అందచందాలతో గాకుండా తెల్లని దుస్తులతో, నవ్వుముఖంతో పరిశుభ్రంగా వెళ్ళవలసిన బాధ్యతను కలిగి వున్నారు కదా!

అందుకని శివరావు కొంచెం అలంకరించుకున్నాడు. భావకవిత్వం రాసే రోజుల్లో మధ్య పాపిడీ, వొదులు సిల్కు లాల్చీ, వల్లెవాటు ఉప్పాడ జరీ ఉత్తరీయం – కేవలం కవితా సామాగ్రిగా ఆవేశాన్నిచ్చేవిగా ఉద్దేశించి ధరించేవాడు. కవితోపాసనకు స్వస్తిచెప్పాక ఆ పగటి వేషంకూడా మార్చాడు. ఇప్పుడు తిరిగి భావకవిగా దర్శనం ఇవ్వాలి కనుక ఆ వేషమే ధరించటం ఉచితమని భావించాడు. జులపాలు తీసివేసినా అవి వున్నట్లు భావిస్తూ తల ఆడించి చూసుకున్నాడు.

అలంకరణ పూర్తిచేసుకొని తనను తాను అద్దంలో చూసుకొని 'కవిత్వం సంగతి దేముడికెరుక – కాని భావకవి అందచందాలన్నీ ఈ రూపంలో దుస్తుల్లో ముమ్మూర్తులా ప్రస్ఫుటిస్తున్నవి!' అనుకొని తృప్తిపడ్డాడు. తాను ముట్టించిన అగ్నిని ఆర్పేందుకు బయలుదేరే ఫైర్ ఇంజిన్‌వలె రోడ్డున పడ్డాడు.

సరాసరి వెళ్ళి ఎదుర్కోవటమే గురిగా పెట్టుకుని ఇతర వెర్రిమొర్రి ఆలోచనలను తలలోకి చేరనీయలేదు శివరావు!

సరికొత్త రకం శృంగార నాయికను కలుసుకోవటం యిదే మొదటిసారి! అందుకని ఆమె మందిరం సమీపిస్తున్న కొద్దీ గుండెలు పీచు పీచు మంటూన్నవి! కలంతో రాసే కవిత్వంతో అయితే ఇలాటి సంఘటనలు చీల్చి చెండాడి వుండేవాడు! కాని ఇది నిత్యజీవితంలో యథార్థ స్వరూపం ఎదురయ్యేప్పటికి యీ పాడు భయం పట్టి పీడిస్తోంది. పాస్‌పోర్ట్‌లా వుత్తరం సపోర్టు తనకు ఉన్నదనే ధైర్యం ముందుకు నెడుతోంది. తొందరలో ఆ కవరు మరచిపోయి వచ్చానేమోనని జేబు తడివి చూసుకొని, జేబులోనే వున్నందుకు సంతోషించాడు.

పుట్టి పెరిగిన వూరు కనుక విద్యుల్లత ఇల్లు కనుక్కోవటం అంత కష్టమవలేదు. ఆహ్వాన సంఘాధ్యక్షత వహించిన వ్యక్తివలె ఇరవై సంవత్సరాల సుందరాంగి వీధి గుమ్మానికి ఆనుకొని ఏ ప్రియుని కోసమో ఎదురు చూస్తున్నట్లు తోచింది శివరావుకు. ఈమె విద్యుల్లత అయి ఉంటుందా? అందచందాలను బట్టీ, వేషభాషలను బట్టీ (ఆమెతో మాటలు కలపకపోయినా ఆమె కళ్ళు మాట్లాడే భాషద్వారా వెలువడే భావాలను భావకవి దుర్భిణిలో నుంచి చూసి, విని తెలుసుకోగలిగాడు!) తీరు తెన్నులను అనుసరించీ, విలాస వైఖరిని గ్రహించీ, మొహంలో దేదీప్యమానంగా వెలుగొందే సంస్కృతిని గమనించీ యీమె విద్యుల్లతే అయి ఉండా లనుకున్నాడు. ఇంతకన్న తక్కువ మెట్టున ఉన్న మగువ తన భావకవిత్వ సారాన్ని ఆస్వాదించేందుకు అనర్హురాలని తన నమ్మకం. అదీగాక ఇలాటి సుందరిముందు కూడా తన మనస్సు పట్టు తప్పదని రుజువు చేసుకోవటంలో జీవితమంతా గర్వించదగ్గ దాన్ని సాధించిన ట్లవుతుంది.

తానామెను గుర్తించలేకపోయినా, తనను చూడగానే ఆమె గుర్తించి తీరాలి. కనుక నడుస్తున్నవాడల్లా ఆ ఇంటిముందు కొచ్చినప్పుడు దాదాపు తడబడిపోయినట్లు నడిచాడు. అయితే ఆమె తనను గమనించలేదు! ఒక్క క్షణం గడిచాక ఒక్కసారి తనవైపు యధాలాపంగా చూసి, ఎవరోలెమ్మనట్లు, తన కెందుకు లెమ్మన్నట్లు మొహం మరో పక్కకు తిప్పుకుంది.

ఈమె విద్యుల్లత అయి వుండకపోవచ్చునే సందేహం శివరావును ఆవరించింది. ఆగి పలకరించే సాహసం లేక, సరాసరి వీధి చివరిదాకా నడిచి వెళ్ళాడు. లేక తాను నవ వేషధారణలో చేసుకున్న మార్పు కారణంగా ఆమె గుర్తించలేదేమో? ఈ ముసుగులో గుద్దులాట దేనికి? తాను ఫలానా అని తనని తానే పరిచయం చేసుకుంటే? లేక ఆమె తేరపార జూసే అవకాశమిస్తే? ఎటూ తనకోసం యెదురుతెన్నులు చూస్తూనే ఉన్నది కనుక, ఘనస్వాగతం ఇవ్వకపోదు. స్వల్పమైన పొరబాట్లు జరుగుతేమాత్రం సర్దుకొని పోవాలికాని! లేక ఈమె విద్యుల్లతే కానిపక్షంలో - ఆమె యిచ్చిన విలాసాన్ని

అనుసరించి కనుగొన్న యిల్లు అదే కనుక, అసలు విలాసిని సందర్శనం అవక మానదు. సంస్కరించేందుకు బయలుదేరిన వాడు ఆ 'చెడు' ఎంత మారుమూలల్లో దాగి ఉన్నప్పటికీ దాన్ని ఓపికతో జుట్టుబట్టి బయటి కీడ్చి సంస్కరించే తీరాలి కదా! ఒక సత్కార్యాచరణలో తన కీ పాడు శంకలు కలగరాదు.

తనకు తను ధైర్యం చెప్పుకొని వెనక్కు తిరిగాడు; సాయంత్రపు చల్లగాలికి పెనవేసుకొన్న వల్లెవాటు తెరచాపల్లే గాలికి ఛంగుఛంగున ఆడుతోంది. రిమ్‌లెస్ కళ్ళజోడును సరిచేసుకొని, వయ్యారంగా చేతులూపుకుంటూ హంసనడకల్ని అనుకరిస్తూ వొళ్ళు తిప్పుకుంటూ నడిచి వస్తున్నాడు శివరావు. అతని దృష్టి అంతా వీధి గుమ్మాన్ని ఆనుకొని ఉన్న వయ్యారి మీదనే వున్నది. ఆమె దృష్టి మాత్రం యెటున్నదో తనకు తెలియటంలేదు.

ఈసారి నిలబడిన ఆమె ఎదుటికే సరాసరి వచ్చి నిలబడ్డాడు; ఆమె దృష్టి శివరావు మీద నిశ్చలమై అంతలోనే తళుక్కుమన్న మెరుపువలె మరో పక్కకు పయనమైనట్లయింది. పేరుకు తగిన చూపులే ననుకున్నాడు శివరావు. తనను గుర్తించలేదనేది నిర్ధారణ ఐంది. అసలీమె విద్యుల్లత కాదేమో? తనను ఆహ్వానించి తనకు ఎదురురాకపోగా ఏ వంటింట్లో పనులు చేసుకుంటోందేమో?

మింగాలేక, కక్కాలేక ఈ బాధపడటం చాలా అనవసరం. తానీ అందాలు చిందేటి అతివ యెదట నిలబడం అసభ్యంగా కూడా తోచింది.

అందుకని గొంతు సవరించుకొని "ఇక్కడ విద్యుల్లతగారి ఇల్లు ఏదండీ?" అన్నాడు, ఆమె భర్త పేరు తెలిసివుంటే ఆ పేరే అడిగేవాడు. తెలియదు కనుకనే ఈ పెద్ద ఇబ్బంది వచ్చిపడింది.

గుర్రం సకిలించినట్లయి ఆమె చప్పున శివరావు వైపు చూసింది, అంటే చాలదు. చాలా నిశితంగా నఖశిఖపర్యంతమూ గుచ్చిగుచ్చి రెండుసార్లు చూపులను తిప్పి తామరపువ్వులాటి ముఖారవిందంమీదికి తుమ్మెద దంపతులు వాలి, ఒక దాన్నొకటి కావలించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నవా అన్న విధంగా ఆమె తన కనుబొమల్ని దగ్గిరికి చేర్చింది.

"ఎందుకూ?" అన్నదామె.

"పని వున్నది!"

"నేనే...ఏమిటా పని?" మాటలు వాడిగా, వేడిగా, నిర్లక్ష్యంగా చిరాకుగా, చీదరింపుగా ఉన్నవి.

శివరావు గొంతులోంచి ఒక్క గుటక కడుపులోకి దూసుకొనిపోయింది. వీధిలో నిలబడి అట్టేసేపు యీ ఇల్లాలితో మాట్లాడటం చాలా ఇబ్బందిగా కూడా తోచింది.

విద్యుల్లత ఈమె అయినప్పుడు - ఆ ఉత్తరానికి కర్తయిన ఈమెకే తెలియదా ఏం రాసిందో? ముఖకళనుబట్టి పిచ్చిదిగా తోచలేదు. కాని వెర్రి వేయి రకాలయితే, ఇదొక రకమేమో తెలియదు.

మొదటి చూపుల్లోనే మోహించి ప్రణయంలో తలకిందులుగా పడిన యీ మోహనాంగి, ఇప్పుడు ఇంతగా తేరిపారిజూచిన తనను గుర్తించకపోవటంలో, లేక గుర్తించనట్లు నటించటంలో అంతరార్థ మేమిటి? అయిన వారెవరన్నా పరిశీలిస్తూంటే, ఈ ఎత్తు ఎత్తిందా? ఈ అనుమానం రాగానే శివరావు ఒక్కసారి వీధి వీధంతా కలయజూచాడు; వీధిలో ఆడుకునే పిల్లలూ, చాలా పలచగా ఉన్న పాంధులూ తప్ప అతనికి ఇంకే విశేషం కనిపించలేదు.

ఏమైతేనేం - ఇక యీ నాన్పుడు వ్యవహారం మరి లాభంలేదు. ఇంజక్షన్ చేయటమే చికిత్సగా నిర్ణయించి సిరింజ్ పట్టుకొని వచ్చిన డాక్టర్‌ను చూసి భయపడి, తనకు వ్యాధే లేదని మొండికేసిన పిల్లవాడి మనస్తత్వం గుర్తొచ్చింది శివరావుకు. చిక్సితచేసి తీరవలసిన తన బాధ్యత కూడా పట్టి బాధిస్తోంది.

పాస్‌పోర్ట్‌లాంటి ఉత్తరాన్ని జేబులోంచి కాస్త పైకి లాగి - "మీరు నన్ను ఆహ్వానించారు- ఈ సాయంత్రం!" అన్నాడు.

ఆమె మరొక్కసారి శివరావును పైనుంచి కిందికి చూసింది. ఎవరో పెద్దమనుషులు అటుగా వెడుతూ ముందు ఆ అందాలకుప్పనూ, ఆ తరువాత అక్కడేం జరుగుతుందోననే ఆతృతనూ చూపుల్లోనే వెల్లడించారు.

మొత్తానికి విద్యుల్లత తెలివిగలదే! అందుకనే "లోపలికి రండి!" అన్నది. స్వరంలో మృదుత్వాన్ని మేళవించి.

ఎదురైన ఆపద మొదటి మెట్టుదాటాడు శివరావు.

ముందు వరండా. దాన్ని ఆనుకొని ఉన్నది పడకగది. ఆమెతో పాటు సరాసరి పడకగదిలోకే వెళ్ళాడు శివరావు. అగరువత్తుల పొగ తాలూకు ఘుమఘుమలతో, మల్లెల వాసనలతో వాతావరణం మత్తెక్కిస్తున్నది. తనకోసమే ఎదురుచూస్తూ అన్ని ఏర్పాట్లూ యీమె సక్రమంగా జరిపించి వుంచి - తనను చూసికూడా చూడనట్లు నటించటం ఒకింత బిగువు చూపి ఆకర్షణను పెంపొందించుకోవటమో, లేక నెరజాణత్వాన్ని ప్రదర్శించి రసికతను వొలకబోయటమో శివరావుకు అర్థమవలేదు. పడకగదిలోని అలంకరణలు చూస్తే విద్యుల్లత అభిరుచులు ఉత్తమతరగతికి చెందినవనే అభిప్రాయం కలగక మానదు.

తన మనస్సుకూడా రసికత్వంతో నిండకముందే, ఆమెతోపాటే తాను కూడా కామగుండంలోపడి భస్మం కాకపూర్వమే, మేలుకొని తన బాధ్యతలను నిర్వర్తించి,

నిర్వికారంగా, పవిత్రంగా బయటికి నడిచి ధన్యుడవాలనే నిశ్చయం శివరావును తొందరపెట్టింది. కావాలని సుడిగుండంలో పడిన వ్యక్తిని రక్షించబోయి, అలివిగాక తానూ మునిగిపోకుండా చూసుకోవాలి. 'నీతికీ, అవినీతికీ మధ్య ఉండే కనపడీ కనపడని ఆ సన్నని చారకు అటు పడకుండా మెలకువగా ఉండాలి' అని తనను తాను హెచ్చరించుకున్నాడు – శివరావు.

"ఏ ఉత్తరం?" అన్నదామె. సంభాషణ ఎలా మొదలు పెట్టాలో తెలియక తికమకపడే శివరావు ఇబ్బందిని దాటించింది.

ఇప్పటికీ ముడివడిన ఆమె కనుబొమలు ఇంకా విడివడక పోవటాన్ని గమనించిన శివరావుకు ఆమె మాటలు సీరియస్‌నెస్‌తో కూడినవేనని నమ్మక తప్పలేదు.

అరికాలిమంట నెత్తికెక్కుతూండగా ఎలాగో తనను తాను సంబాళించుకొని, "మీ పేరు విద్యుల్లతగారేనా?" అన్నాడు సంశయాలను సందేహాలనూ మొదటినుంచీ సమాధానపరచుకోవడం మంచిదనుకొని.

"ఔనని చెప్పానుగా!" అన్నదామె విలాసంగా, అజంతా విగ్రహం లాగ వొంగి పందిరిమంచాన్ని ఆనుకొని. తాను కవిత్వం రాసే రోజుల్లో అయితే ఈమెను ఎదురుగా ఉంచుకొని అత్యద్భుత విధానంలో కవిత్వం గీకి పారేసి ఉండేవాణ్ణనుకున్నాడు – శివరావు.

"మీరు నాకు వ్రాసిన లేఖ!"

"నేనా? ఏదీ?"

తను ఆమెను "ఏమండీ!" అని సంబోధిస్తూంటే ఆమాత్రం గౌరవ వాచకాన్ని కూడా ఆమె ప్రయోగించటం లేదని శివరావు గ్రహించాడు. అంత చనువు లేకపోయినా, తన ఆధిక్యతను ఆమె తనమీద ఎందుకు ప్రయోగాత్మకంగా నిరూపించవలసి వస్తోందో మాత్రం అర్థం కాలేదు. మర్యాద యిచ్చి పుచ్చుకోవలసిందనే విషయాన్ని కూడా విస్మరించటం ఈమెకే చెల్లిందేమో? లేక ఎక్కడో జరిగిన పెద్ద పొరపాటును తనకు అనుకూలంగా తీసుకొని, అధికారాన్ని చెలాయించేందుకు ప్రయత్నిస్తూ వుండాలి!

"ఈ వుత్తరం–" అని జేబులోంచి కవరు తీసి ఆమె కళ్ళముందు టపటప లాడించి, తన ఆర్గ్యుమెంటు గెలిచే పరిస్థితుల్ని ఏర్పరచిన లాయరు పోజు వేశాడు.

ఆ కవరు చూశాక ఆమె కనుబొమ ముడి కాస్త విడింది.

"కవిగారు తమర్ని పంపారా?" అన్నది కనబడీ కనబడని చిరునవ్వుతో.

"నేనే ఆ కవిని!" కవిగాడి భృత్యుడని తనను ఆమె ఎందుకు పొరబడిందో తెలియలేదు. ముఖం మార్చకుండా కాస్త వస్త్రధారణ మార్చేపాటికి గుర్తుపట్టలేని మార్పు తనలో యెలా సంభవమైనదో!

"మీ పేరు?"

"ఈ కవరుమీద ఎడ్రస్ రాసిన నీకు తెలియదా?" గంభీరస్వరంతో ఏకవచన ప్రయోగాన్ని తీవ్రంగానే చేయవలసిన సమయమని శివరావు నిశ్చయించుకున్నాడు.

"మీరూ కవిత్వం రాస్తారా?" వెకిలిగా నవ్వుతోందామె. పిలిచి అవమానిం చేందుకు ఈమెకు యెంత సాహసం!

"రాస్తాడే-రంకులాడీ!...వల్లెవాటు వేసిన పల్లెవాడల్లా కవిత్వంగాక ఏం రాస్తాడంట? గడ్డం పెంచిన ప్రతి గాడిద మైకం కమ్మిన నీ కళ్ళకు కవిగారల్లేనే ఉంటాడే!...ఎవడ్రా నువ్వు?" మెరుపు తీగల్లే తనముందు విద్యుల్లత ఉంటే, ఉరుములు పిడుగులల్లే ధ్వనించిన ఆ కంఠ స్వరానికే శివరావులో కంపర మెత్తింది. విద్యుల్లత మొహం వెలవెలబోతూండటం చూసి, ఏదో గొప్ప ప్రమాదం - పేవ్‌మెంటుమీద నడిచే వాడి వెనుకనుంచి వేగంతో వచ్చి గుద్దిన లారీవలె వచ్చిపడిందనే విషయమూ అర్థమైంది. ఆ స్వరానికి గదిలోని ప్రతివస్తువూ కంపిస్తూండటం చూసి, వాటితోపాటే తను కూడా కంపించిపోతున్నట్లు తెలుసుకున్నాడు శివరావు.

వెనుదిరిగి చూశాక ఆ కంపరం, కంఠస్వరానికి అనువుగావున్న ఆకారానికి ఒక అలంకరణేనని కూడా తెలుసుకున్నాడు. ఎప్పుడూ కమ్మని కలలు కంటూ, కమనీయమైన కుసుమకోమలుల్ని మాత్రమే ఊహించి ఇదివరలో రాసిన కవిత్వాన్ని జ్ఞాపకం చేసుకొంటూ, చల్లని వెన్నెలవలె హాయిగా, ఆనందంగా ఉల్లాసంగా ఉండే సంఘటనలకి అలవడి వున్నాడు శివరావు. తాను ఊహించలేని, చూడని కొత్త ఆకారం - రాజకుమారిని బందీగా వుంచి అనుభవించే రాక్షస స్వరూపం భూత భేతాళాది ఆకారం - కోరమీసాలతో, కారం కురిపిస్తున్నట్టుండే కళ్ళతో, అనాగరిక, అరసికతలకు రూపకల్పనగా కనిపించే ఆ వ్యక్తి దర్శనంతో శివరావు గడగడగడ లాడిపోవడం శివరావు బలహీనతే ననేందుకు వీలులేదు. ఎందుకంటే గండకత్తెరలో ఇరుక్కున్న వా రెవరైనాసరే ప్రస్తుతం శివరావు పొందే మానసిక పరిణామాలనే తప్పక పొందుతారని నమ్మకంగా చెప్పవచ్చు.

అలనాడు సిద్ధాంత రూపాన ఉన్న తన కవిత్వ సరంజామా కేవలం తూకానికి కొనేందుకు యమధర్మరాజల్లే వచ్చిన బుక్ కిల్లర్ వలెనే ఇప్పుడు ప్రయోగాత్మకంచేసిన కవిత్వాన్ని సృష్టించిన ఈ కవిబ్రహ్మను హతమార్చేందుకు వచ్చిన శక్తిసంపన్నుడైన దుష్టశక్తివలె ఈయన కనిపించాడు.

జవాబు యెలా ఇవ్వాలో తెలియక తికమక పడుతూంటే శివరావు వీపు మీద చరిచిన చరుపుకు ఒక పెద్ద అరుపు జవాబై ఉండవలసింది. ఆ మోతకు కూతపట్టి ఉండవలసింది. ఎలాగో నిభాయించుకున్నాడు.

"ఎవడ్రా నువ్వు? ఎందుకొచ్చావ్?" అన్నదా భేతాళరూపం శివరావును తనవైపుకు తిప్పుకొని.

ఆ గదికి ఒకే ద్వారానికి అడ్డుగా భూతంమల్లే నిలబడి ఉన్నాడాయన! ('వాడు' అని మనసులో అనుకునేందుకే శివరావుకు భయం వేసింది.) జారి దూసుకొని పోదామన్నా వీలులేకుండా ఉన్నది.

ఆ భీకరాకారుని కండలు తిరిగిన కరం మళ్ళీ పైకి లేచింది. సరాసరి గురిగా తన తలమీదే పడితే ఆ గుద్దుకు గిద్దెడు మిరియాలు కక్కవలసి ఉంటుందని తెలుసుకున్న శివరావు ఒణికిపోయే కంఠంలోంచి తుంచినట్లుగా "ఈ...ఉ....త్త...రం!" అన్నాడు వొణికే చేతులతో జేబులో ఉత్తరాన్ని బయటికి తీస్తూ.

రెప్పపాటులో కవిగారి చేతుల్లో ఉన్న ఉత్తరాన్ని ఆ వికృతాకారుడు గుంజుకున్నాడు. తను ఉత్తరం చదువుతూండగా కవిగాడు జారిపోకుండా వుండేందుకుగాను కాలు గుమ్మంమీదికి జాచి ఉంచి, ఉత్తరాన్ని చదివాడు. ఆ తరువాత ఘీంకరింపులాటిది కవి కర్ణపుటాల్లో జొరబడింది.

"కులటా! నేను కాంప్‌కు వెళితే నా వెనుక ఇదా నాటకం?" అన్నాడు ఆమె భర్తగా తనను తాను యెరుకపరచుకొన్న దానవునిలాటి (కవి దృష్ట్యా, బహుశా విద్యుల్లత దృష్ట్యా కూడానేమో?) మానవుడు!

"కవికుమారా! ప్రేమ కవిత్వంతో ప్రియురాళ్ళ వేట సాగించావా?"

"లేదు...లేదు...సత్యప్రమాణ పూర్తిగా చెపుతున్నాను. 'ఇది నీకు మెచ్చదని నచ్చచెప్పేందుకే నేనిక్కడికి వచ్చాను. నా హృదయాన్ని చీల్చి చూస్తే..."

"చీల్చనీ...చీల్చి చండాడనీ!" అని ఒక్క ఉరుకులో శివరావు మీద పడ్డాడు, విద్యుల్లతా నిజనాధుడు!

"ఒద్దు....ఒద్దు...ఖూనీకేసు అవుతుంది!" అంటున్నాడు శివరావు. నిజమైన ప్రత్యర్థి చేతులమధ్య నలిగి నల్లేరుకాడ అవుతూ.

"ఖూనీ వొద్దులే...ఇలాటి పాడు, చీడ కవిత్వం మరి రాయకుండా ఉంటావా?"

"రాయటం మానేసి చాలా రోజులైంది!"

"ఉహుఁ వీడు సార్వభౌముడటే సరసజాక్షీ!" అని భార్యవైపు తిరిగి ఆమె గుడ్లు మిటకరించి గుటకలు మింగుతూండటం చూసి "రాజుల కాలం పోయిందిరా కవిగా! కాపరాల కూకటివేళ్ళకు ప్రమాదకరంగా ఉండే పురుగుల్ని ఏరిపారేస్తారా!" అని దభీ దభీమని నాలుగు మఋగు గుద్దులు ...వీపుమీద కుమ్మరించాడు.

శివరావు శరీరం పైత్యం ప్రకోపించినట్లు వికారంతో, తలతిరుగుతున్నట్లయింది. పైన పడిన పర్వతం ఏమాత్రం సందు ఇచ్చినా తెరిచిఉన్న గుమ్మంలోంచి విల్లువిడిచిన

శరంవలె దూసుకొని పొయ్యే ఎత్తులో ఉన్నాడు శివరావు. శివరావనే తాను శవరావుగా మారకపోవటమే ప్రస్తుతం అదృష్టాలలో ఒకటనే నమ్మకంతోకూడా ఉన్నాడు.

“ఇక ఎప్పుడైనా ఈ వీధిన కనిపించావో డొక్క చీరి పారేస్తా. జవాబు చెప్పు–”

“ఇటు రాను!” అన్నాడు శివరావు నీరస స్వరంతో.

“చెంపలు వేసుకో!”

చప్పుడయేట్లు చెంపలు వాయించుకున్నాడు శివరావు.

స్థూలకాయుడు యీ శిక్ష చాలునా, చాలదా అని ఆలోచించేంత పట్టువిడిచాడు. అంతే! శివరావు కళ్ళనున్న రిమ్‌లెస్ కళ్ళజోడు కిందపడిపోయినా, దాన్నిగూర్చి ఆలోచించకుండానే ఎంతో ప్రయత్నంమీద కాళ్ళూ చేతులూ స్వాధీనంలోకి తెచ్చుకొని, పరుగుపరుగున గుమ్మం దాటుతున్నాడు.

“చచ్చాను!....నన్ను చంపేస్తున్నాడు! రక్షించండి!” అనే కోమలస్వరాలు అతి దీనంగా అర్థిస్తున్నప్పటికీ శివరావు అవేమీ వినిపించుకోకుండా, మళ్ళీ వెనుదిరిగి చూడకుండా ప్రేమపక్షిగా బయలుదేరిన తను కేవలం పక్షిగా (అక్కుపక్షి కానందుకు సంబరపడి!) రెక్కలు చాచి చెంగు చెంగున ఎగురుకుంటూ ఇంటిదారిన అదే పోత పొయ్యాడు. సంస్కరణ కార్యక్రమానికి నీళ్ళధార వదులుకొని ఆ రాత్రి వేడినీళ్ళు కాపువేసుకుని పీడ కలలతో గడిపాడు.

భావకవిత్వం రాయటం మానుకున్నాక, ఆ కవిత్వాన్ని చదవటం కూడా మానుకొన్న కారణాన తనలాగే మరో శివరావు బయలుదేరాడనీ, వాడికి బట్వాడా కావలసిన ఉత్తరం తన పాలపడబట్టే, ఈ తిప్పలు తనకి తప్పలేదనే విషయం నసాళం అంటేట్లు అర్థమైంది. వాడి శరీరానికి బదులు తన శరీరానికి మరామత్తు జరిగింది. ఎవరి శిక్షనో తాను అనుభవించటం సంస్కరణోద్యమంలో జమపడుతుందో లేదో మాత్రం శివరావుకు తెలియదు, తెలుసుకోవాలనీ అతనికి లేదు.

*– జనవరి, 1963*